వచ్చీ కుర్చీలో కూర్చున్నారు. మనిషిలో ఎటువంటి మార్పూ లేదు. పూర్వంలాగే ఎల్.ఐ.సి. ఎడ్వర్‌టైజ్‌మెంటులాగే ఉన్నారు. నా అంచనా రైటయితే అతనికి డెబ్భై ఏళ్ళుండాలి కాని అప్పుడు యాభై వెళ్ళిన వాడిలా ఉన్నారు. పూర్వంలాగే కుర్చీలో వెనక చేరబడకుండానే తిన్నగా మేకు దిగకొట్టినట్టే కూర్చున్నారు. మమ్మల్నందరినీ ఒక్కసారి కలయజూసి ఎలావుంది నీ ప్రాక్టీస్ డాక్టర్?" అని మా వారిని ప్రశ్నించేరు. ఇతను డాక్టరు కాదు నాన్నా అని మాత్రం జగన్నాథం చెప్పేడు.

మొదలయ్యిందీ నేనన్నది కాదనడం? నా కెందుకీ గోల, అమ్మాయ్ రుక్మిణీ నాకు వడ్డించేయ్ అన్నారు.

జగన్నాథం భార్య రుక్మిణి వచ్చి ద్వారంలో అతనికి కనిపించ కుండా నిలబడి అతను (రామారావుగారు) అప్పుడేభోంచేసేరని జగన్నాథానికి సంజ్ఞలతో చెప్పింది.

నువ్వు భోంచేసేవేమో ఆలోచించు నాన్నా" అన్నాడు జగన్నాథం.

ఆఖరికి ఈ స్థితికి దిగజారుతాననుకోలేదు. సాయంత్రం లోగా పెద్దలకి కబురుపెట్టు, పంపకాలైపోదాం. నాకు వండే ఓపిక దానికింగా వుండదులే. చటుక్కున లేచి వెళ్ళి ముందు వాకిట్లో ఒక చెట్టుకు పాళెం (మళ్ళీ తవ్వడం ప్రారంభించేరు).

జగన్నాథం తెల్లబోయి చూసేం మేమంతా.

దగ్గర దగ్గర మూడేళ్ళయింది, ఇదే ధోరణి. మీకు రాయటం మానెయ్యాలనే మానేశాను అన్నాడు జగన్నాథం.

అతిసర్వత్ర వర్జయేత్.

**(1975)**

# జలుబు చేసిందా?

**"ఏ**ఁవిఁటా చప్పుడు" తుళ్ళిపడి కప్పులో కాఫీ చీరమీద వంపే సుకుంటూ అడిగింది పరమహంసగారి భార్య గీత.

దక్షిణాన భూకంపం వచ్చిందన్నా, అధమం మా బాత్ రూము పడిపోయిందనేనా చెప్తేగాని నమ్మే పరిస్థితిలో లేదు ఆవిడ. నిజానికి ఈ రెండింటిలో ఏది జరిగినా బావుండేది. కాని అంతకంటే ఘోరం జరిగింది.

"మా ఆయన తుమ్మేరు" అన్నాను.

వీలైనంత నెమ్మదిగా, లోపల పెరుగుతున్న ఆతృత కనపడ కుండా.

మా వారికి కోపం వస్తే ఒళ్ళు తెలీదు, జలుబు చేస్తే ప్రపం చవేఁ తెలీదు.

"జడ్జిగారు తుమ్మేరా?" అంది గీత అదేదో నమ్మరానిదన్నట్లు. ఆవిడ యింకా ఆషాక్ నుండి కోలుకోలేదనడానికి సాక్ష్యం – ఆవిడ చేతిలో కప్పు, చీరమీద ఒలికిన కాఫీ యింకా అలాగే వున్నాయి.

"ఏం? ఆయనకు తుమ్మడం రాదనుకున్నావా? లేక పోతే జడ్జీలు తుమ్మకూడదా?" అన్నాను. ఆ సంభాషణ అంతటితో ఆపేద్దామని.

"అబ్బేఁ, అదికాదు..." ఏదో అనబోయి మాటలు రాక ఆగిపోయింది పాపం. ఆవిడ పరిస్థితి నాకు పూర్తిగా తెలుసు. ఆవిడ తప్పేంలేదు. ఆయనలా తుమ్ముతారు బిందెనిండా పటాసూ, గంధకం కుక్కి అంటించినట్లు.

ఒకసారి... మా తోడికోడలు వద్దన ఏర్పాట్లు చేస్తూ కంచు మరచెంబుతో నీళ్లు పట్టుకొని వంటింట్లోకి వెళ్తోంది. అదే టైములో ఆయన ఆఫీసు గదిలో తుమ్మేరు. వెంటనే మాకందరికీ వినిపించింది వంటింట్లోంచి ఓ గావు కేక. మత్తు మందు లేకుండా ఆపరేషన్ చేయించుకుంటున్న రోగి ఆ కేకను ఇమిటేట్ చేస్తే కొంతవరకు సక్సెస్ అవొచ్చు. మేమంతా వంటింట్లోకి పరిగెత్తేం. మా తోటికోడలు పరిగెత్తడానికి వీల్లేనంత భయపడి "ఏమైంది?" అంది వెర్రి చూపులు చూస్తూ– పడిపోడానికి ఓపిక లేక నిల్చొనే పేషెంట్ అయిన దానిలావుంది.

"నీకాలు బద్దలైంది" అన్నానేను. అప్పుడు చూసుకుంది. తన కుడికాలి బొటనవేలు రమారమిలేదని, ఆ వేలు చూస్తేనే మాంసం ముద్దవుంది. నేలని నీళ్ళతో కలిసి రక్తం పారుతోంది. అప్పటికి ఆవిడకి ఒంటి మీద తెలివివచ్చి అయ్యో..." అని ఏదో అనబోయింది.

"మరచెంబు సొట్ట పోయింది" అన్నారు అతను. మా తోటి కోడలు ఏడుపు "అయ్యో"తో ఆగిపోయింది.

మరోసారి–

మాకో కుక్కపిల్ల వుండేది. పెద్దదికాదు కాబట్టి అనాలి.

కుక్కలు రాత్రి మేలుకొని పగలు పడుకుంటాయట. అది మాత్రం కేవలం భోజనం టైములోనే మేలుకోని వుండేది. అప్పుడైనా భోజనానికి ఏవైపు వెళ్ళాలో చూసి ఆవైపుకన్నే విప్పేది. అది కమ్యూనిస్టు (కుక్క) అని నమ్మకం. ఎందు కంటే దొంగ వచ్చినా, దొర వచ్చినా ఒక్కలాగే నిద్ర పోయేది. అది కమ్యూనిస్టు కాకుండ మహర్షి అని కూడా నా నమ్మకం? అది ఎప్పుడూ ఎవరిమీదా అరవగా నేను చూళ్ళేదు. ఆఖరికి తోటి కుక్క మీద కూడా. అది కొంచెం పెద్దయ్యేక మా ఇంట్లో దొంగలుపడ్డారు. ఆశకొద్దీ పడ్డారే కాని మా ఇంట్లో వాళ్ళు తీసికెళ్ళడానికి పనికొచ్చేవి ఏవీఁ కనిపించలేదు. అంత శ్రమ పడి వచ్చేక ఏఁవీఁ తీసికెళ్ళ కుండా వెళ్ళడానికి మనసొప్పక ఏవో తువ్వాళ్ళూ, చీరలూ వగైరాలు పట్టుకుపోయేరు. వగైరాలలో మా కుక్క కూడా వుంది. అసలు మా ఇంట్లో ఏవస్తువూ వాళ్ళకి నచ్చినట్లులేదు. నిజం చెప్పాలంటే దొంగకి కాకపోయినా, మా ఇంట్లో వస్తువు నాకూ నచ్చదు కాని ఏం చేస్తాం? దొంగలకున్న ఛాయిస్ నాకు లేదు.

ఇంతకీ చెప్పొచ్చే దేఁటంటే.. అది... అంటే మా కుక్క ఒక సాయంత్రం అరుగుమీద పడుకుంది. అప్పటికి దానికి ఆరు నెలలుంటాయి. మా ఆయన మేడ మీద తుమ్మేరు అంతే మా కుక్క పడుకున్న పోజులోనే గాలిలోకి గజంమీదకి ఎగిరి – అక్కడో అరక్షణం ఆగి, అదే పోజుతో నేలని పడి పరిగెత్తడం ప్రారంభించింది. అది రెండు కళ్ళు ఒక్కసారి విప్పగలదనీ, పరిగెత్తగల దనీ కూడా అప్పుడే తెలిసింది మాకు. దాని వెనకాలే మేమూ బైల్దేరేసరికి అది ఊరవతలకి వెళ్ళిపోయి, ఇంక పరిగెత్తలేక ఆగిపోయింది. మేము దాన్ని చేరేసరికి, అది మళ్ళీ పరిగెత్తడానికి ప్రయత్నించింది కాని, అలవాటులేకో, అతి నీరసంవల్లో ఆ ప్రయత్నం వణుకుగా మారింది.

మేమంతా దాన్ని ఇంటికి రమ్మని బతిమాలేం. "బలుసాకులు తిని బతుకుతాను, కాని రానంది.

ఆర్గ్యుమెంటు చెప్పేం.

అది లక్ష్యపెట్టలేదు.

"ఇంకెప్పుడూ తుమ్మన్లే, రా". అని మావారు దానికి అభయం ఇచ్చేరు. కాని అంతగట్టిగా తుమ్మేవారి మాటలు నమ్మకూడ దన్నట్టు రానంది.

"పో, వెధవా. నీ ఇష్టం వచ్చిన చోటుకి ఫో, ఇవాళ నుండి నువ్వు మా కుక్కవికావు" వగైరా అచ్చువెయ్యడానికి అభ్యంతరం లేని తిట్లు మూడూ అభ్యంతరం వున్న తిట్లు ఒకటీ తిట్టేరు. మేవంతా రామ, రావణ సంవాదంలా, మా వారి, కుక్క సంవాదం వింటూ నిల్చున్నాం.

మా కుక్కకి అంత ఆత్మగౌరవం వుందని మాకు అంతవరకూ తెలీదు. బూతు చెవినిపడగానే రక్కున మా వెంట వచ్చేసింది.

ఇంతకీ ప్రస్తుత విషయం ఆయన తుమ్మేరు. అంటే మా ఇంటి సూర్యుడికి వారం రోజులు గ్రహణం. ఈ వారం రోజులూ మా ఇంట్లో ఎవరూ మాట్లాడ్డానికి వీల్లేదు. కుక్క కూడా అరవడానికి వీల్లేదు. ఆ సంగతి దానికీ తెలుసు వారం చివర కొనుక్కోవలసినవి ఆరడజను గాజుగ్లాసులూ రెండో మూడో కప్పులూ, అప్పుడప్పుడూ నూనె సీసాలు కూడాను. ఈ వారం రోజులూ అధమం రోజుకోసారైనా చేతిలో వున్న కప్పో, గ్లాసో గోడకి విసిరి కొట్టేస్తారు. ఈ వారంరోజులూ మా పిల్లలు ఆయన కంటపడరు. జవాన్లకీ, నాకూ తప్పదు.

అసలు వాళ్ళ వంశంలోనే వుంది, ఈ రొంప (జలుబు పిచ్చి అనాలో – పిచ్చి రొంప అనాలో – ఇది వాళ్ళన్నారంటే మా మావఁగారు మరీను. అతని ప్రకారం జలుబుని మించిన జబ్బు ఇంకోటి లేదు. అతనికోసారి రొంపచేసింది అప్పుడు మా ఇంట్లో దూరపుబంధు వొకడున్నాడు. ఉన్న వాడు ఊరుకోక – మోహర్బానీ కోసవేఁవో – "పడిశం పదిరోగాలపెట్టు అంటారు" అన్నాడు.

"అలా అన్న గాడిదకొడిక్కి పదికిమించి రోగాలుంటాయని తెలియదు" అన్నారు మా మావగారు.

"అంటారు" అని తన వాక్యానికి కలిపినందుకు మా బంధు వెంతో సంతోషించి వుండాలి.

మా మావఁగారి దగ్గర ఓ కర్రపెట్టె వుండేది. దాన్ని ఎవరూ ముట్టుకోవడానికి వీల్లేదు, రొంపకి ఆయన సంపాదించిన మందులన్నీ అందులో వుంటాయి. అందులో సుమారు వందకి పైనే వుంటాయి. ఏ ఒక్కటీ రెండుసార్లు వాడలేదు. ఏ ఒక్కటీ పని చెయ్యలేదు.

అతను మొదటి తుమ్ము తుమ్మగానే భూతవైద్యుడికీ, మంత్రసానికీ మినహావైద్యంతో సంబంధించిన అంత మందికీ కబుర్లు వెళ్ళేవి. ఎవరు ఏ మందు యిచ్చినా తాగేసేవారు. ఏ పని చెయ్యమన్నా చేసేవారు. రొంపలేని రోజుల్లో కూడా మందులు సేకరి

స్తూనే వుండేవారు. ఒకసారి ఏదో ఊరు వెళ్ళి రాత్రి భోజనాల టైముకి తిరిగి వచ్చేరు. ఆయన చేతిలో కిరసనాయిలు సిసా అంత సీసావుంది. అప్పుడు యుద్ధం రోజులు కిరసనాయిలు దొరకదు కాబట్టి ఎక్కడైనా దొరికితే కిరసనాయిలే తెచ్చేరను కున్నాను. కాని కాదుట, తరవాత తెలిసింది. ఎలాగంటే, అప్పుడే భోజనం చేసి చేయికడుక్కుంటున్న "వారాలబ్బాయి" పేరు అప్పల నరసింహ తుమ్మేడు.

"ఓరేయ్ ఇలారా" అన్నారు మా మావఁగారు. ద్రోహం చేసిన వాళ్ళా వెళ్ళేడు ఆ అబ్బాయి.

"తుమ్మేవా?" అన్నారు.

కాదంటే కాల్చేస్తారేమోనని అవునన్నాడు.

"అయితే గ్లాసు తీసుకురా" అని, ఇదిగో, ఇది రొంపకి దివ్యౌషధమంటే, శ్రీపాద ఆయన స్వంతంగా కనిపెట్టేట్ట. రొంప రావడానికి, పోవడానికి కూడా అదే మందుట" అన్నారు మా అందరితో.

అప్పల నరసింహం గ్లాసు పట్టుకొని వచ్చేడు గ్లాసు సగం వరకు మందుపోసి "అంతా ఒక్క గుక్కలోనే మింగేయ్యాలిట రెండో గుటకవేసేవా మందు పనిచెయ్యదు" అంటూ అతనికిచ్చేరు.

ఒక్క గుటకలోనే మింగేసేడు పాపం ఆ అబ్బాయి. అంతే తర్వాత ఏమైందీ మాకు కనిపించలేదు. మాకు వినిపించిం దల్లా గ్లాసు నేలని ఎత్తేసిన శబ్దం మనిషి పరిగెడుతున్న శబ్దం. మేము ఏం జరిగిందో గ్రహించే లోపునే ఆ అబ్బాయి వీధి దాటి ఎటో వెళ్ళిపోయేడు. ఆ రాత్రి అతని కోసం వెతికేం కాని కనిపించలేదు. మర్నాడు పొద్దునే "చెరువు గట్టుమీద పడి వున్నాడని" చెప్పి ఎవరో తీసుకొచ్చేరు.

కొంతసేపయ్యేక పక్కకి పిల్చి అడిగేను

"మందు ఎలా వుందని".

"లావా ఎప్పుడూ తాగలేదుగానీండి ఇలాగే వుంటుదను కుంటాను" అన్నాడు.

"మందు తాగేక ఏమైంది?" అన్నాను.

"నాకు తెలీదండి. చెరువు గట్టుమీద ఎవరో లేపడమే, జ్ఞాపకంవుంది" అన్నాడు.

ఈసారి అన్ని విషయాలు గుర్తుంచుకోమన్నాను. ఆ తర్వాత మళ్ళీ మా ఇంటికి వారానికి రాలేదు అతను.

మరోనాడు...

మా మావగారికి రొంప పట్టినప్పుడు రంగాచారిగారు పాలూ, మిరియాలు కలిపి తీసుకోమన్నారుట. ఇంటి కొస్తూనే "చూసేవా? ఇంత చిన్న విషయం మనకి తెలీనే తెలీదు. అమో ఘంగా పనిచేస్తుందట. ఉట్టి పాలూ, ఉట్టి మిరియాలూనట. కలిపి తీసుకుంటే చాలుట" అన్నా మా అత్తగారితో. అప్పటికి మా అత్తగారికి మొగుడ్ని బాహాటంగా ధిక్కరించే వయసు వచ్చే సింది. నిజం చెప్పాలంటే ఆవిడ చిన్నప్పటి నుండి అతన్ని బాహాటంగానే ధిక్కరించేదిట?

"ఉట్టి పాలంటే-పోనీ ఒట్టిపోయిన ఆవులు యిస్తాయ నుకున్నా, ఉట్టి మిరియా లెక్కడ దొరుకుతాయి"? అందావిడ.

"ఏఁవిఁటేవిటే? మళ్ళీ అనూ" అన్నారతను.

మళ్ళీ అందావిడ.

అతనేమనే వారో తెలియదు తుమ్మడం ప్రారంభించడం వల్ల. తర్వాత ఆయనే మిరియాలు రోట్లోవేసి కొట్టడం ప్రారం భించేరు. "ఈ మిరియాలు వస్త్రక్షాళితం చెయ్యాలేవిటో కను క్కురా" అని ఆచారిగారి దగ్గరకు మనిషిని పంపేరు. చెయ్య మన్నారు ఆచారిగారు. తర్వాత మళ్ళీ "కప్పుడు పాలల్లో మిరి యాల పొడివేయ్యాలా? కప్పుపొడిలో పాలు వెయ్యాలా?" కను క్కోమని మనిషిని పంపేరు; ఇక్కడే ఏదో పొరపాటు జరిగింది. కప్పుడు పొడిలో పాలు వేసుకోమన్నారట ఆచారిగారు. వైద్యం పూర్తయ్యేసరికి రాత్రి ఎనిమిదైంది. ఎనిమిదిన్నర వరకూ బాగానే వున్నారు. తర్వాత ఎంత మంది చెప్పినా వినకుండా పెరట్లో నూతి దగ్గరకు వెళ్ళి స్వయంగా నీళ్ళు తోడుకొని అరగంటసేపు చన్నీళ్ళస్నానం చేశారు. తడి బట్టల్తోనే ఇంట్లోకి వస్తూ "ఈ రాత్రి నాకంట ఎవరు పడినా ఖూనీ చేసేస్తానని" వార్నింగిచ్చి తన గదిలోకి వెళ్ళి తలుపు గడియ పెట్టేసుకున్నారు. రాత్రి పన్నెండు వరకూ భక్తి పాటలూ, తర్వాత బండ బూతులూ వినిపించేయి. ఆ మందు బాధ వదిలేసరికి వారం పట్టింది.

ఇంకోసారి... మా మావఁగారికి మందుల పాత్రుడు మరో చిట్కా చెప్పేడు. ఒక చదరపుటడుగు తెలక పిండి తెచ్చి ఆవిరి మీద ఆకారం పోకుండా ఉడకపెట్టి, తులం ఏలకు గుండజల్లి దానికి అయిదు లవంగాలు (నాలుగు మూలలా నాలుగూ; మధ్య నొకటి) గుచ్చి, రెండు గంటలు చల్లార్చి గుండెలకు కట్టుకొని పడుకుంటే ఏనుగు జలుబైనా సరే ఎగిరి పోతుందిట,

నాకు ఈ వైద్యంలో నమ్మకం ఏర్పడింది. ఎంచేతనంటే రొంప రాగానే ప్రయత్నిస్తే, పోయ్యాటైముకి దొరకవచ్చు చదరపుటడుగు తెలక పిండి ముక్క. ఎలాగైతేనేం తెలక పిండిని పాత్రుడోక్తంగా తయారు చేసే సరికి మధ్యాన్నం ఒంటిగంటైంది. వరండాలో మంచంమీద పడుకున్న మాఁవగారు మందుని పక్కనే టేబిలు మీద పెట్టి "మీరు పాపం పన్లు చూసుకొండి. నేను కట్టుకుం టాను", అన్నారు. బతుకు జీవుడా అనుకొని మేవంతా వెళ్ళి పోయేం. ఆయన యిలా కన్నుమూసే సరికి మా పక్కింటి గొల్లపూడి వారి గేదె, దానికి తెలకపిండి ఇష్టమో, లవంగాలు ఇష్టమో ఏలకపొడి ఇష్టమో, లేకపోతే దానికీ జలుబు చేస్తే దాని డాక్టరు ఈ వైద్యం చెప్పేడో (గేదెల్లో కూడా ఆచార్లుంటా రేమో) గాని–మొత్తానికి అది వచ్చి ఆ మూడు కలిపి తినేసిందట.

అబ్బ; ఏఁవాఁకలే దాన్ది!! ఆ సోమయాజులు వెధవ దాని కెప్పుడూ గడ్డి పెట్టడేఁవిఁటోగాని, నా ఆరోగ్యం బావుంటే నన్ను కూడా తినేసేది. గోడవాల్ పోష్టర్లూ, పెరళ్ళలో గావంచాలూ తినే అది పాలిస్తోందా వెధవకి" అని పక్కింటి గొల్లపూడి వారిని ప్రత్యేకంగానూ, వారివంశాన్ని, వారి గేదెగుణాల్ని జనరల్‌గానూ అరగంట తిట్టేరు. మళ్ళీ ఆ వైద్యం ప్రయత్నించడానికి వీల్లేక పోయింది, ఆ రాత్రే ఆయన ఊరెళ్ళిపోవడం వల్ల.

సరిగ్గా అక్షరాలా ఆ తండ్రికి కొడుకే ఈయన. ఒక్క విషయం నేను కూడా ఒప్పుకోవాలి. మా వారు మైనర్ రొంప మహర్షి లాంటివారు అందుచేత రొంప చేసినప్పుడు మాత్రం నోరెత్తను. ఆయన తన రొంపకి ఆలోపతీ, యునాని, ఆయుర్వేద, హోమి యోపతి మొదలగు వైద్యాలూ–పాలూ మిరియం, వగైరా చిట్కాలూ అన్నీ వాడేవారు. కాకపోతే ఒక్కటే నియమం, క్రిందటి సారి వాడినది వాడకూడదని.

ఈ మధ్య మాకు కొంతమంది కుర్ర డాక్టర్లు పరిచయం అయ్యేరు. (పాపం! వాళ్ళని చూస్తే నాకెంతో జాలి ఇంత మంచి వాళ్ళు కూడా దొంగ డాక్టర్లు అయిపోతారు గదాని).

ఒకసారి రొంప చేసినప్పుడు ఈ డాక్టర్ల బృందానికి కబురు పెట్టేం.

మొదట వచ్చింది కృష్ణమూర్తి. రాగానే "అసలు రొంప ఎందుకు వస్తుంది"? అన్నారు ఈయన ఓరల్లు ఎగ్జామినర్‌లాగా.

"అసలు రొంపైనా, వడ్డీ రొంపైనా వైరస్ యిన్‌ఫెక్షన్" అన్నాడు క్రిష్ణమూర్తి.

"నాకు రొంప పట్టింది, ఏమందూ పనిచెయ్యడంలేదు" అన్నారు ఈయన.

"దానికి మేమంతా చేసుకునే వైద్యం ఒక క్వార్టర్ బాటిల్ బ్రాందీ–తీసుకొండి. కాని మీరు కొంటే ఏం బావుంటుంది! నేను తెచ్చి పెడతాలెండి" అని వెళ్ళిపోయేడు.

ఆ సాయంత్రం ఇద్దరూ చెరో క్వార్టరు బాటిలూ తెచ్చి యిచ్చేరు. రొంప విషయంలో మాత్రం ఎవరేం చెప్పినా పాటించే నియమం వుంది కాబట్టి ఇద్దరు తెచ్చినవీ తాగెయ్యాలన్నారు ఆయన. ఆయన జీనియస్‌లో నా కెలాంటి డౌటూలేదు కాని, రొంప పట్టినప్పుడు మాత్రం ఆయనకి పదో ఎక్కం కూడా రాదు. అంచేత ఒక్క సీసా తాగితేచాలని నమ్మించడానికి ప్రయ త్నించిన నేనూ, పిల్లలూ కూడా చేసిన ప్రయత్నాలేం పని చెయ్యలేదు. పోనీ మనిషికి 'మందు' వ్యామోహమా, అంటే గాంధీలాంటి మనిషి.

రాత్రి పదైంది రెండు బాటిల్సూ పూర్తి అయేయి. ఆ రాత్రంతా నిద్రాలేదు, రొంపాలేదు. ఒంటిమీద తెలివీ లేదు. మర్నాడుదయం తెలివి పూర్తిగా రాలేదుగాని రొంప విత్ తల నొప్పి పూర్తిగా వచ్చేసింది. ఆ మధ్యాన్నం పాపం కాస్త కునుకు పట్టింది, అమ్మయ్య అనుకున్నాను. కాని అనుకున్నంతసేపు కూడా లేదు. నిద్రలో ఏదో గొణగడం ప్రారంభించేరు. తర్వాత ఆ గొడుగు కేకలుగామారి దిగ్గున లేచి కూర్చున్నారు.

"జడుసుకున్నావేఁవిఁటి నాన్నా? ఇలా కేకలేస్తున్నావ్?" మా చిన్ని ధైర్యంగా అడిగాడు. ఆయన్తో – విత్ ఆర్ విఠౌట్ రొంప. ఏమాటైనా అనగల, ఏ జోకైనా వెయ్యగల ధైర్యం మా ఇంట్లోవా డొక్కడికే వుంది.

"అలా చెప్పు, నా కేకలే నన్నుమాట అంత గట్టిగా విని పించేయి. నా కేకలకి నేనే లేచిపోయేనా? మంచి జోకే" అని మళ్ళీ పడుకున్నారు. ఇంకా నయం. నేను కేక లెయ్యకుండా కాపలాకాయి అని నన్ను పరమాయించలేదు.

ఆ తర్వాత కృష్ణమూర్తే బ్రాందీ వైద్యం మానేసి ఇంకేదో వైద్యం చేసేడు. ఎలాగైతేనేం రొంప పూర్తిగా పోయేసరికి వారం పట్టింది. అంచేతే కాబోలు రొంప మందు పుచ్చు కుంటే వారం లోనూ, పుచ్చుకోకపోతే ఏడు రోజుల్లోనూ పోతుందంటారు.

మరోసారి ఆయనకి రొంప వచ్చినప్పుడు కృష్ణమూర్తే కాబోలు. కాబోలేంటి, అతనికే ఆయన దగ్గర ఆ చనువుంది.

"ఈ మందులు సంగతలా వుంచండి. ఫీడ్ ది కోల్డ్ అండ్ స్టార్వ్ ది ఫీవర్" అంటారు అన్నాడు.

ఇన్నాళ్ళూ చెప్పేవే కాదేcవిఁటి? నాకొంచెం జ్వరం వుందనుకొ. దానికి ఉపవాసం పెడతాను రాత్రి అని సుష్టు పూర్తిగా రొంపకి భోజనం పెట్టేరు. పెరుగూ అన్నం తిన్న పడిశం పెరిగింది. ఉపవాసం వుండబోయే జ్వరం కూడా పెరిగింది.

"స్టార్వేషన్ ఈజ్ ది బెస్ట్ డయట్ అని చేప విషయంలోనే అన్నారనుకున్నాను. జ్వరాని క్కూడా వర్తిస్తుందన్నమాట" ఆశ్చర్య పోయేరు ఆయన.

ఇంతకీ అసలు విషయం, బాత్‌రూమ్‌లో ఆయన తుమ్మేరు. తుమ్మేక వార్ క్లౌడ్‌లా డైనింగ్ హాల్లోకి వచ్చి "ఆయనేరీ? ఎప్పుడొచ్చేరు మీరు? ఒకసారి నా రూమ్‌లోకి రా" అని గీతతోనూ, నాతోనూ ఒక్క గుక్కలోనే మాట్టాడి జవాబు అక్కర్లేనట్లు తన గదిలో పరిగెత్తారు. నేను వెళ్ళేసరికి పక్కమీద బోర్లా పడుకున్నారు. చెప్పొద్దూ, ఎంత మొగుడైనప్పటికీ నాకు నిజంగానే జాలేసింది. ఎంతటి మనిషి ఎలా అయిపోయేరు కడవంత గుమ్మడికాయి కత్తిపీటకు లోకువ – అన్నట్టు.

నేనేం. అతి తెలివైనదాన్ని కాను. కాని ఆయనతో ఎప్పుడు మాట్లాడ కూడదో మాత్రం బాగాతెలుసు అందచేత వెళ్ళి మంచం పక్కన మాట్లాడకుండా నిలుచున్నాను.

"వచ్చేవా!" అన్నారు వీలైనంత శాంతంగా.

"ఆc" అన్నాను

"చూడూ, నాకు రొంప వచ్చేసింది. గీత బహుశా నాలుగు రోజులుంటారు. ఈ రొంప వారం వుంటుంది. మరంచేత ఈ నాలుగు రోజులూ నువ్వు నాకు కనిపిస్తే బహుశా చంపక మానను, చంపడానికి మొహమాట పడితే కురుక్షేత్రం తప్పదు. మరంచేత కాఫీ వగైరాలన్నీ నా గదిలోకే పంపించీ, వింటున్నావా?" అన్నారు.

"ఊc"

"ఇప్పుడు దయచేసి గెటవుట్" అని గట్టిగా అరిచారు. ఆ అరుపుకి గోడనున్న ఫోటో ఒకటి కిందపడి భళ్ళుమంది. నేను గబగబా బైటికి పోయి తలుపులు ధామ్మని వేశేసేను.

ఈ గెటవుటూ, భళ్ళుమ్మన్న శబ్దం విన్న గీత భయపడిపోయి "ఏవైంది?" అంది, ఏవౌతుంది?

ఇంక ఆపేస్తాను. ఎంచేతంటే మావారు ఇప్పుడే తుమ్మేరు.

**(1975)**

# డబ్బు-1

"సేతా వాతాగాని మొగుడు మంచంనిండా ఉన్నాడని బెంచీకి సరిపడా ఒక్కడివే కూకున్నావు. కసింత సరకాయించు బాబురే" అంటూ అతను బెంచీమీద కూర్చున్నాడు.

"ఏంటి మాcవాc..." పక్కవాడు ఏదో అనబోయేడు.

"అమ్మ పేరెట్టుకోడానికని ఒక్కర్తిని కనడానికేయిన్ని పాట్లు పడుతున్నాను. యింక నీకు మాcవcనవడానికి మరోర్తిని కనాలా? సాలొల్లకో..."

"యిప్పుడు నువ్వు కంటే మాత్తరం ఎపుడు జేసుకుంటాదులే?"

"నాను పుట్టకపోతే నువ్వెవర్ని కట్టుకునివోడివని పెళ్ళావc డిగితే నీ యమ్మని అన్నాట్ల ఎనకటికి నీలాటోడే. ఇప్పుడు కనాలేగాని నువ్వు గాకపోతే నీ బాబులాటోళ్ళు పది మంది దొరుకుతారు నా కూతిరికి. యీ వొయినులో కనాలేగాని ఎండి కడ్డీలాటిది వుట్టదూ? ఇంతకీ ఇప్పుడవన్నీ ఎందుకులే..."

"ఏటి మావాc అప్పుడే అంత ముసిలోడీవైపోనానంటావేcటి?"

"నా నసకపోతే కానేటి? మొన్న నా వయసోడే మా వూరోడు అగపడ్డాడు. అగుపడి ఆ వూసూ ఈ వూసూ ఆడి ఆస్పత్రి కెళతానని తెగిసాడు. పిప్పళ్ల బస్తాలాగున్నావు. ఆసుపత్రి కేలొరే అన్నాను. "ఏటి చెప్మంటావు? రేత్రి మా ఆడది.." అన్నాడు. బొడ్డూడని వెధవలు మీ కెందుకొరే ఈ కబుర్లన్నీని... కాస్త ఒటేలు ప్రొప్రైట్రు బాబుని పిలు బల్లక్లీన్ సెయ్యమనాలి".

"పళ్లూడిపోయినా పోనిది, పళ్ళన్నీ రాకముందు వుడితే తప్పా?" మీసం వస్తున్న వాడొకడడిగాడు.

"నిజమేనొరే. ముందటేడు గుంటూరు కెళ్ళినప్పుడు సివం చెలంగోడు కనిపించి" ఊళ్లోకి నరసమ్మ వచ్చిందిట. నా నెళ్ళి సూసొస్తాను కాస్త టాక్సీకాడనిలబడు. బేరం పోద్దో ఏటో అన్నాడు.

"నరసమ్మెవరు?"

"అడ్నొగ్గేసిన పెళ్ళాం."

"ఒగ్గేసిన పెళ్ళాన్ని సూద్దానికా"